క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ.1,01,116 విరాళం



నిత్యాన్నదానానికి విరాళం అందిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం గునుపూడిలో వేంచేసియున్న పంచారామ క్షేత్రం సోమేశ్వర జనార్దనస్వామి వార్ల నిత్య అన్నదాన ట్రస్టుకు గుడివాడకు చెందిన యామిజాల సాగర సుబ్బలక్ష్మి, యామిజాల లక్ష్మీ నారాయణ జ్ఞాపకార్థం రూ.1,01,116 విరాళంగా సమర్పించారని ఈఓ డి.రామకృష్ణంరాజు తెలిపారు.

వైఎస్సార్ సీపీలో చేరిన సీనియర్ నాయకుడు రవి



భీమవరంలో వైఎస్సార్ సీపీలో చేరిన రవికి పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న శ్రీనివాస్

భీమవరం: భీమవరంలోని 21వ వార్డుకు చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు వస్త్రాల రవి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సమక్షంలో బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడానికి వైఎస్సార్ సీపీ చక్కటి వేదికన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ జంగం మాణిక్యాలరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు తోట భోగయ్య, గుంటి ప్రభు పాల్గొన్నారు.

తల్లి, కుమారుడి అదృశ్యంపై కేసు నమోదు

భీమవరం: భీమవరం టుటౌన్ ఏరియాకు చెందిన తల్లి, ఆమె కుమారుడి కన్పించడం లేదని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టుటౌన్ ఏఎస్సై పి సూర్యనారాయణ బుధవారం చెప్పారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. భార్యాభర్తల మధ్య వివాదం కారణంగా తన కుమార్తె బి పూర్ణిమ, ఆమె కుమారుడు సత్యకార్తీక్ ఈనెల 2వ తేదీ నుంచి కన్పించడం లేదని పూర్ణిమ తండ్రి జి. రాధాకృష్ణ పోలీసులను ఆశ్రయించారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై చెప్పారు.

మండుతున్న ఎండలు



మాదివాడలోని మజ్జిగ చలివేంద్రం వద్ద దాహార్తి తీర్చుకుంటున్న విద్యార్థులు, ప్రజలు

ఆకివీడు : గ్రీష్మ తాపానికి ప్రజలు తల్లడిల్లిపోతున్నారు. రోజురోజుకూ ఎండలు తీవ్రమవుతున్నాయి. ఉదయం నుండే భానుడు భగభగమంటుంటే ప్రజలు బయటకు రావడానికి బెంబేలెత్తిపోతున్నారు. పాఠశాలల వద్ద ప్రత్యేకంగా మంచినీటి సదుపాయం కల్పించారు. స్థానిక మాదివాడ రాధారంగా మిత్రమండలి ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రంలో ఆర్టీసీ బస్‌స్టాండ్ దగ్గరలో ఉండటంతో ప్రయాణీకులు, పాదాచారులు, విద్యార్థులు దాహార్తిని తీర్చుకుంటున్నారు.

చంద్రబాబు వల్లే వృద్ధులకు అవస్థలు

పెనుగొండ: చంద్రబాబు చేసిన ఘనకార్యం వల్లే అవ్వాతాతలు నేడు అవస్థలు పడాల్సి వస్తుందని మాజీమంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు విమర్శించారు. బుధవారం పెనుగొండ మండలం వెంకట్రామ పురం, పెనుగొండలోని మల్లప్ప దిబ్బ, చిన్నంవారిపాలెంలో ఎన్నికల శంఖారావంలో భాగంగా పాదయాత్ర నిర్వహించి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రామపురం ప్రధాన రహదారి నిర్మాణం చేసినందుకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. నాడు నేడుతో వెంకట్రామపురంలో పాఠశాల రూపురేఖలు మార్చారంటూ కితాబునిచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆది నుంచి వలంటీరు వ్యవస్థపై కక్ష గట్టుకొని ఉండడంతో ఎన్నికల నేపథ్యంలో ముందుగానే వలంటీర్లను అడ్డుతప్పించే పన్నాగంలో భాగంగా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారని వివరించారు. దీంతో అవ్వాతాతలకు, వికలాంగులకు పింఛన్ అందించలేని పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. మండు వేసవి ఎండలతో సచివాలయంకు వచ్చి పింఛన్ తీసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. కుట్రలు పన్నే చంద్రబాబుకు ప్రజలు బుద్ధి చెప్పాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. సంక్షేమం ఇంటి వద్దకే నేరుగా రావడానికి సీఎం జగన్‌కు మద్దతు పలకాలని పిలుపు నిచ్చారు. రాబోయే ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి మరోసారి విజయాన్ని అందించాలని కోరారు. ఎంపీపీ పుతినీడి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు పోడూరి గోవర్ధన. మండల కన్వీనరు నలిమిల్లి బాబి రెడ్డి, వెంకట్రామపురం సర్పంచ్ పిల్లి అనంతలక్ష్మీ నాగన్న, ఎంపీటీసీ సభ్యురాలు పెచ్చెట్టి లలిత, మద్దింశెట్టి లలిత పాల్గొన్నారు.

పింఛన్ కోసం పడిగాపులు

- ఉదయం నుంచి సచివాలయాల వద్ద వేచి చూసిన లబ్ధిదారులు
- మధ్యాహ్నం నుంచి పింఛన్ల పంపిణీ



దుంపగడప సచివాలయం వద్ద పింఛన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం



పింఛన్ కోసం సచివాలయానికి వచ్చి వెనుదిరిగిన లబ్ధిదారులు



పింఛన్ కోసం సచివాలయానికి వస్తున్న లబ్ధిదారులు

ఆకివీడు: పింఛన్ల పంపిణీ నుంచి వలంటీర్లను తప్పించడంతో లబ్ధిదారులకు కష్టాలు మొదలయ్యాయి. బుధవారం పింఛన్లు పంపిణీ చేస్తారన్న సమాచారంతో సచివాలయాల వద్దకు వచ్చిన లబ్ధిదారులకు నిరీక్షణ తప్పలేదు. గురువారం ఉదయం 6 గంటలకు రావాలని సచివాలయ సిబ్బంది చెప్పడంతో లబ్ధిదారుకు నిరాశ, నిస్పృహలతో ఎండలో వెనుదిరిగారు. ఆకివీడులోని దుంపగడప రోడ్డులో నివశించే కొండ్రోతు నర్సమ్మ నిడమర్రులోని తన కుమార్తె వద్ద ఉంటోంది. పింఛన్ కోసం ఆకివీడు అవస్థపడి వచ్చి నిరాశతో తిరిగి వెళ్లింది. దివ్యాంగులు, ఇతరులు కూడా పింఛన్ కోసం సచివాలయాలకు వెళ్లి అవస్థలు పడ్డారు.

సాయంత్రం పింఛన్ల పంపిణీ ప్రారంభం

బుధవారం సాయంత్రం మండలంలోని అన్ని పంచాయతీల్లో పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. లబ్ధిదారులు సచివాలయాలకు వెళ్లి పింఛన్ సొమ్ము తీసుకున్నారు. అన్ని పంచాయతీలకూ పింఛన్ సొమ్ము అందజేశామని ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు.

లబ్ధిదారులు పడిగాపులు

భీమవరం అర్బన్: భీమవరం మండలంలో సచివాలయాల వద్ద పెన్షన్ సొమ్ము కోసం వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు బుధవారం పడిగాపులు కాశారు. ఐదేళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి నెల ఒకటో తేదీన సూర్యోదయానికి ముందే వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు పంపిణీ చేసేవారు. వలంటీర్ల వ్యవస్థపై టీడీపీ నాయకులు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసి అడ్డుకోవడంతో బుధవారం నుంచి పెన్షన్లు లబ్ధిదారులకు ఇవ్వడంతో మండుటెండలో నడుచుకుంటూ సచివాలయాలు వద్దకు చేరుకుని పెన్షన్ సొమ్ము కోసం లబ్ధిదారులు పడిగాపులు కాశారు. కొంతమందికి పింఛన్లు అందకపోవడంతో నిరాశతో ఇంటికి వెనుతిరిగారు. మండలంలో 25 గ్రామ పంచాయతీల్లో 11,623 పెన్షన్లు ఉన్నాయి. వాటిలో బుధవారం 2,800 పెన్షన్లు పంపిణీ చేసినట్లు అధికారులు చెప్పారు.

సచివాలయాల వద్ద లబ్ధిదారులకు పెన్షన్ల పంపిణీ

వీరవాసరం: మండల వ్యాప్తంగా సచివాలయాల వద్ద పెన్షన్ పంపిణీ బుధవారం కార్యక్రమం చేపట్టారు. ఆయా గ్రామాల్లోని లబ్ధిదారులంతా గ్రామ సచివాలయాలకు రావడానికి అవస్థలు పడుతున్నారు. ఎండ వేడిమి తాళలేక వృద్ధులు, వితంతువులు నానా అగచాట్లు పడుతున్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు ఉంటే తమ ఇంటికి పెన్షన్లు తీసుకువచ్చే వారని లబ్ధిదారులు వాపోతున్నారు. నడవలేని పరిస్థితిలో ఉన్న తమ లాంటివారు ఇబ్బంది పడుతూ గ్రామ సచివాలయాల వద్దకు వెళ్లాల్సి వస్తోందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో ఇప్పటి వరకు 20% లబ్ధిదారులకు పెన్షన్లు అందజేసినటట్టు ఎంపీడీవో తెలిపారు.

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామా



ఆకివీడు : ఎంపీడీఓకు రాజీనామా పత్రం అందిస్తున్న వలంటీర్లు



కాళ్ల : కార్యదర్శికి రాజీనామా పత్రాలు అందిస్తున్న వలంటీర్లు

ఆకివీడు : వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. స్థానిక నగర పంచాయతీ పరిధిలోని 2, 3 వార్డులకు చెందిన తొమ్మిది మంది వలంటీర్లు తమ రాజీనామా పత్రాల్ని ఎంపీడీఓ రామకృష్ణకు బుధవారం అందజేశారు. వీరిలో రాలి అరుణ, ఆనుగొంది సత్య భార్గవి, గెడ్డా దుర్గ, తోలేటి సుజన్‌రాజు, దోమవరపు సురేష్, నూతక్కి పవన్, రాలి రాజు, పట్నా శ్యామ్యూల్, అబ్దుల్ ఫహీమ్ ఉన్నారు. ఈ సందర్భంగా వారు వైఎస్సార్ సీపీ 3వ వార్డు ఇన్‌చార్జి అందే రాజబాబు నివాసం వద్ద విలేకర్లతో మాట్లాడారు. తమ వ్యక్తిత్వాన్ని కించపరిచే విధంగా ప్రతిపక్ష పార్టీలు అనుసరిస్తోన్న తీరు బాధాకరమన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసే పథకాలను లబ్ధిదారులకు చిత్తశుద్ధితో అందజేస్తున్నామని చెప్పారు. వలంటీర్‌గా చేరిన తరువాత సేవాభావం తమలో పెంపొందిందని తెలిపారు. సమావేశంలో వార్డు ఇన్‌చార్జిలు అందే రాజబాబు, రుంకాని శ్రీహరి, రాజనాల పట్టాభి ఉన్నారు.

జువ్వలపాలెం, సీసలిలో ఐదుగురు రాజీనామా



వీరవాసరం: రాజీనామా చేసిన వలంటీర్లు

కాళ్ల: కాళ్ల మండలం జువ్వలపాలెంలో ఒక్కరు, సీసలిలో నలుగురు వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శులకు బుధవారం అందజేశారు. వలంటీర్ల వ్యవస్థపై టీడీపీ వ్యవహరిస్తోన్న తీరు చాలా బాధాకరమని పేర్కొన్నారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి సేవలందించినప్పుడు టీడీపీ నాయకులు ఏమయ్యారని ప్రశ్నించారు. పింఛన్ల పంపిణీని అడ్డుకోవడం వల్ల వృద్ధులు, దివ్యాంగులు, అవ్వాతాతలు తీవ్ర ఇబ్బందులు పడతారని తెలిపారు. తమపై టీడీపీ, జనసేన పార్టీలు అక్కసు వెళ్లగక్కుతునే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

వలంటీర్ల రాజీనామా

వీరవాసరం: వీరవాసరం మండల వ్యాప్తంగా పలు గ్రామాల నుంచి వలంటీర్లు బుధవారం స్వచ్ఛందంగా రాజీనామాలు సమర్పించారు. ఆయా గ్రామాల్లోని గ్రామ సచివాలయ కార్యదర్శులకు తమ రాజీనామా పత్రాలను బుధవారం అందజేశారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం గ్రామ సచివాలయం, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేశారని అన్నారు. అవ్వ తాతలకు పెన్షన్‌తో పాటు ప్రజలకు ఈ అవసరం వచ్చినా ముందుండి సేవా దృక్పథంతో పనిచేశామన్నారు. ప్రజలకు సేవలందిస్తున్న గ్రామ వలంటీర్లపై టీడీపీ నాయకులు దుర్బుద్ధిని ప్రదర్శించారన్నారు. వీరవాసరం మండల వ్యాప్తంగా 150 మంది వలంటీర్లు గ్రామ సచివాలయాల కార్యదర్శులకు రాజీనామా పత్రాలను అందజేశారు.

జగనన్న ఫొటో ఉన్న కప్పుల్లో కాఫీలు, టీలు



చెరుకువాడలో జగనన్న ఫొటో ఉన్న కప్పుల్లో కాఫీ, టీలు అందిస్తున్న ప్రసాద్, సింధు దంపతులు

ఉండి: సీఎం జగనన్న ఫొటో ఉన్న కప్పుల్లో వైఎస్సార్ సీపీ నాయకులకు కాఫీలు, టీలు ఇచ్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు చెరుకువాడ శెట్టిబలిజపేటకు చెందిన కొప్పిశెట్టి ప్రసాద్, సింధు దంపతులు. ఉండి మండలం చెరుకువాడలో సర్పంచ్ కొండవేటి సాంబశివరావు, పార్టీ గ్రామ అధ్యక్షుడు కొండవేటి సత్యనారాయణ (సత్తిబాబు) ఆధ్వర్యంలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సమయంలో జగనన్న ఫొటో ఉన్న కప్పులతో కాఫీలు, టీలు ఇవ్వడంతో నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. ఇలాంటి అభిమానులు జగనన్నకు మాత్రమే ఉంటారని రాష్ట్ర క్రిష్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్రపాటి అనిత అన్నారు. కార్యక్రమంలో గుండాబత్తుల సతీష్, బిల్ మోరియా, కోట పరమేష్, పండు, మేరీ, చంటి, బాలం రాజు, నోవాహు, భగవాన్‌రాజు, చంటి, చిట్టి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కారుమూరి పరామర్శ

తణుకు టౌన్: తణుకు మండలం వేల్పూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త యల్లమెల్లి ఎలీషా ఇంటీవల గుండెపోటుతో మరణించారు. వారి కుటుంబాన్ని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పరామర్శించారు. బుధవారం వేల్పూరులోని ఎలీషా నివాసంలో ఎలీషా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎలీషా కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వేల్పూరు గ్రామంలోని పలువురు నాయకులను మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు బుధవారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు నున్న దుర్గాప్రసాద్, ఎంపీటీసీ చుంద్రు శ్యామల, వార్డు సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు పట్టం కట్టాలి

నరసాపురం రూరల్: ప్రజలకు సంక్షేమ పాలనను అందిస్తున్న వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు ఓటర్లను విజ్ఞప్తి చేశారు. నరసాపురం మండలంలోని ఎల్బీచర్లలో బుధవారం వేకువజాము నుంచి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్నే మనకు మరోసారి ముఖ్యమంత్రి కావాలని, సంక్షేమం అభివృద్ధి జగనన్నతోనే సాధ్యమని అన్నారు. విద్య, వైద్య రంగాల్లో సీఎం జగన్‌విప్లవాత్మక మార్పులు తీసుకు వచ్చారని, ప్రతి ఓటరూ ఫ్యాన్ గుర్తుపై ఎంపీ, ఎమ్మెల్యేలకు రెండు ఓట్లు వేయా లని అన్నారు. నియోజకవర్గంలో తాను చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ప్రజలు మరో సారి అవకాశం ఇవ్వాలని కోరారు. ఎల్బీచర్ల లో తండ్రి ముదునూరి ప్రసాదరాజుకు ఓ వైపు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తుండగా నాన్నను గెలిపించాలంటూ ప్రసాదరాజు తనయుడు ముదునూరి శ్రీకృష్ణంరాజు అదే గ్రామంలోని చిల్లపాలెం, బైనపాలెంలో ఓట్లు అభ్యర్థించారు. అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ తిరుమాని నాగరాజు, జెడ్పీటీసీ సభ్యులు బొక్కా రాధాకృష్ణ, బాపూజీ, వేములదీవి సర్పంచ్ యమునా భానుమూర్తి పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనకు నీరాజనాలు



బద్దావానిపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

పాలకొల్లు అర్బన్: సీఎం జగన్ పాలనకు ప్రజలు నీరాజనాలు పడుతున్నారని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) స్పష్టం చేశారు. పాలకొల్లు పట్టణంలోని 27వ వార్డు లజపతిరాయపేట, బద్దావానిపేట, చాంబర్స్ కళాశాల ప్రాంతాల్లో బుధవారం గుడాల గోపి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతిగడపలోనూ లబ్ధిదారులు సంక్షేమ పథకాలు పొందారని చెప్పారు. ఓటర్లే స్వయంగా వారు పొందిన లబ్ధిని వివరిస్తూ సీఎం జగన్‌కే ఓటు వేస్తామని చెబుతున్నారని గోపి వివరించారు. సీఎం జగన్ పాలనపై ప్రతీ ఒక్కరికీ నమ్మకం కలిగిందన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలకు మరింత మేలు చేసే విధంగా మ్యానిఫెస్టోని సీఎం జగన్ సిద్ధం చేస్తున్నారన్నారు. ప్రతిపక్ష పార్టీలకు డిపాజిట్‌లు కూడా దక్కవన్నారు.

పింఛన్ల కోసం అవ్వాతాతల అవస్థ

అవ్వాతాతలకు అందించే పింఛన్లను కూడా చంద్రబాబు అడ్డుకుని వారికి ద్రోహం చేశారన్నారు. సచివాలయాల వద్ద పింఛన్ కోసం పడిగాపులు కాస్తున్నారని, చంద్రబాబుకి బుద్ధి చెబుతారన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే పింఛన్లను వలంటీర్లు ఇంటికి తీసుకు వచ్చి ఇస్తారన్నారు. కార్యక్రమంలో టీటీడీ పాలక మండలి సభ్యులు మేకా శేషుబాబు, పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు, వార్డు ఇన్‌చార్జ్ ఉప్పె పండుబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చిలువూరి కుమారదత్తాత్రేయవర్మ, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు, పార్టీ సీనియర్ నాయకుడు అడబాల వెంకటరమణ,ఏఎంసీ మాజీ చైర్మన్ సాలా నరసయ్య, పట్టణ సచివాలయ కన్వీనర్ మోర్త గిరీష్, వార్డు నాయకులు పాలపర్తి కృపానాథ్, బద్దా అంతర్వేది, నీలంశెట్టి సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ హయాంలోనే ప్రజలకు మేలు

వైఎస్సార్ సీపీ పరిశీలకురాలు శ్రీలక్ష్మి



బూత్ కన్వీనర్లతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ పరిశీలకురాలు పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి



చెక్క ఫ్యాన్ గుర్తులను ఆవిష్కరించిన శ్రీలక్ష్మి

ఉండి: సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వారందరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే మేలు జరిగిందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకురాలు, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి అన్నారు. బుధవారం ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం గ్రామ సర్పంచ్ సూరవరపు కనకదుర్గ ఇంటివద్ద మండలంలోని 54 పోలింగ్ బూత్‌ల కన్వీనర్లతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి కుటుంబానికీ రూ.లక్షల్లో లబ్ధి చేకూర్చిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ఓట్లు వేసేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని చెప్పారు. చంద్రబాబు పాలనకు జగనన్న పాలనకు ఉన్నతేడాను, జగనన్న పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రజలను మోసగించేందుకు ప్రతిపక్షాలు గుంపుగా వస్తున్నాయని, వారి దుర్బుద్ధిని గమనించాలని కోరారు. చంద్రబాబు, పవన్ వంటి నాయకులు అధికార దాహంతో మాత్రమే వస్తున్నారని తెలిపారు. వలంటీర్ల ద్వారా అవ్వాతాతలకు, దివ్యాంగుల ఇంటికెళ్లి పింఛన్ పంపిణీ చేయకుండా చంద్రబాబు అడ్డుకున్నారని ఆరోపించారు. ఉండిలో వైఎస్సార్ సీపీ జెండాను రెపరెపలాడించి ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు, ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాలలను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఎన్నార్పీ అగ్రహారం సర్పంచ్ సూరవరపు కనకదుర్గ భర్త జిల్లా బీసీ సంఘ కార్యనిర్వాహక అధ్యక్షుడు వెంకటాచార్యులు స్వయంగా చెక్కతో తయారు చేసిన ఫ్యాన్ గుర్తులను శ్రీలక్ష్మి ఆవిష్కరించారు. ప్రతి పేదవాడి గుండె చప్పుడు ఫ్యాన్ గుర్తు అని అన్నారు. కార్యక్రమంలో జానపద కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, స్టేట్ క్రిష్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్రపాటి అనిత, ఎన్నార్పీ అగ్రహారం సర్పంచ్ సూరవరపు కనకదుర్గ, ఉపసర్పంచ్ గొట్టుముక్కల కల్యాణ్‌వర్మ, సర్పంచ్‌లు ముదునూరి వెంకట సోమరాజు, గోగులమండ చినకృష్ణమూర్తి, గలావిల్లి ధనుంజయ, ముదునూరి కొండరాజు, ముదునూరి సుబ్బరాజు, మున్నలూరి శ్రీను, బులుసు రామకృష్ణ, పుప్పాల పండు, అంబటి రమేష్, జి.సుందర్ కుమార్, గెద్దా భోగేశ్వరరావు, కరిమెరక మల్లికార్జున, బడుగు బాలాజీ, విప్పర్తి మాణిక్యాలరావు, శేషాద్రి శ్రీను, నిమ్మల కేశవకుమార్, వత్రే పైడియ్య పాల్గొన్నారు.

శృంగవృక్షంలో పీవీఎల్ ఎన్నికల ప్రచారం



శృంగవృక్షంలో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్, సర్పంచ్ సూరిబాబు

పాలకోడేరు: ప్రతినెలా ఒకటో తేదీన అవ్వాతాతలకు ఇంటికీ పట్టుకొచ్చి ఇచ్చే పింఛన్ సొమ్మును టీడీపీ, జనసేన కుట్రల వల్ల ఇవ్వలేక పోతున్నామని, తలుచుకుంటే గుండె చెరువు అవుతోందని వైఎస్సార్ సీపీ ఉండి నియోజకవర్గ అభ్యర్థి పీవీఎల్ నరసింహరాజు ఆవేదన వ్యక్తంచేశారు. బుధవారం ఆయన శృంగవృక్షం చినపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ జగనన్న నెరవేర్చారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తు వేసి అఖండ మెజార్టీతో వైఎస్సార్ సీపీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

క్రైస్తవుల మనోభావాలను కించపర్చడం తగదు



సమావేశంలో మాట్లాడుతున్న ఎఫ్ఎఫ్‌సీఐ జిల్లా కార్యవర్గం

భీమవరం: క్రైస్తవులపై భజరంగ్‌దళ్ చేస్తున్న ప్రచారం దారుణమని ఎఫ్ఎఫ్‌సీఐ జిల్లా కార్యవర్గం ఆవేదన వ్యక్తం చేసింది. బుధవారం భీమవరంలో ఎఫ్ఎఫ్‌సీఐ జాతీయ అధ్యక్షుడు పుట్టా పీటర్, జిల్లా అధ్యక్షుడు స్టాన్లీ థామస్ మాట్లాడారు. భజరంగ్‌దళ్ కొద్ది రోజులుగా క్రైస్తవ మత విశ్వాసాలకు ప్రతీక అయిన బాప్తీజం ఫొటోలతో క్రైస్తవ మనోభావాలను కించపరిచే విధంగా చేస్తున్న ట్రోలింగ్‌లను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సోషల్ మీడియాలో చేస్తున్న మతాల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలను తక్షణం తొలగించి క్రైస్తవులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. భజరంగ్ దళ్ చేస్తున్న దుష్ప్రచారంపై కలెక్టర్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అధ్యక్షుడు జె.ఐజక్ పాల్, జిల్లా అధ్యక్షుడు వై.రాజు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటేయండి



దుంపగడపలో ఓటర్ల అవగాహన ర్యాలీ

ఆకివీడు : ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ జి.కృష్ణ మోహన్ పిలుపునిచ్చారు. ఆకివీడు మండలం దుంపగడప గ్రామంలోని వీవీగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఏర్పాటుచేసిన ఓటర్ల అవగాహనా సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఓటు హక్కు వినియోగంలో రాజకీయ ఒత్తిడి, ప్రలోభాలకూ తల వంచవద్దని సూచించారు. ఓటు విలువ, ఓటు నియమాలను వివరించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ ఉపయోగించే విధానాన్ని తెలియజేశారు. జిల్లా స్వీప్ నోడల్ అధికారి ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజలు ఓటు హక్కు నిబద్ధతతో వినియోగించుకొని, మంచి నాయకుల్ని ఎన్నుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ కె.సుజాత అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో స్వీప్ సభ్యుడు సప్ప శ్రీనివాస్, చరణ్, ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.

బధిర పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం: భీమవరంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేంకటేశ్వర బధిరుల ఉన్నత పాఠశాలలో ప్రవేశాల కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు స్కూల్ ప్రిన్సిపాల్ జె లక్ష్మీనర్సమ్మ బుధవారం చెప్పారు. పట్టణంలోని బలుసుమూడి కుమ్మర్లవీధిలో నిర్వహిస్తున్న బధిర బాల, బాలికలు రానున్న విద్యాసంవత్సరంలో 1వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. పాఠశాలలోని విద్యార్థులకు ఉచితంగా విద్యాబోధనతోపాటు నోటు, పాఠ్య పుస్తకాలు, స్కూల్ యూనిఫాం, ఉచిత భోజన, వసతి సదుపాయం కల్పిస్తారన్నారు. 6 నుంచి 13 ఏళ్ల వయస్సున్న వినికిడి లోపం కలిగిన బాల, బాలికలు ఈనెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్ నంబర్లు: 94922 63791, 77026 67973 సంప్రదించాలని కోరారు.